# 110. భీమ్‌రావ్ టాగూర్

"నా సీరియల్ గురించి ఏమైనా ఉత్తరాలొస్తున్నాయా?" అని ఒక పత్రిక ఆఫీసుకి వెళ్లి ఎడిటర్ గార్ని అడిగిందట ఒకావిడ; తన సీరియల్ నాలుగో సంచిక విడుదలైన రెండో రోజున.

"ఇదుగో; ఒకటొచ్చింది.... ఈ సీరియల్ రాస్తున్నది తనుకాదని ప్రకటించమని సరిగ్గా మీ పేరే గల ఒకావిడ తన ఫోటోతో సహా ఉత్తరం పంపేరు; మీ (మా); (మన) వార పత్రికలో ఈ సీరియల్ చదివి; ఈ సీరియల్ రాసింది ఆవిడే నేమో అనుకొని; వాళ్ల బంధువులూ, స్నేహితులూ (ముఖ్యంగా వాళ్లాయన)- ఆవిణ్ణి కాకులు పొడిచినట్టు పొడుస్తున్నారుట. ఆత్మరక్షణకి ప్రకటన తప్ప మరో దారిలేనట్టుంది; ప్రకటనకి ఏమైనా బిల్లు అయితే కట్టుకుంటాను - అంటూ దీనంగా రాసింది" అని ఎడిటర్ గారు కన్నీళ్లు తుడుచుకుంటూ చెప్పాడట.

నేను ఒకప్పుడు పనిచేసిన ఆఫీసులో భీమారావని ఒక సీనియర్ అసిస్టెంటు ఉండేవాడు. (ఇప్పుడు కూడా ఉన్నాడు; అసిస్టెంటు మేనేజర్ హోదాలో.) అతను అప్పటికి ఇరవై ఏళ్లుగా పత్రికల్లో వస్తున్న కథలూ కాకరకాయలూ చదువుతున్నాడు. బడ్డీ లైబ్రరీల ద్వారా (అద్దెకి) సరఫరా అవుతున్న నవలలూ చదువుతున్నాడు. అలా కొన్నాళ్లు గడిచాక "ఈ మాత్రం నేను రాయలేక పోతానా?" అనే ఆత్మ విశ్వాసం కలిగి "కసిగా ఉంది, కసికసిగా ఉంది!" అని టైటిల్ పెట్టి ఒక సోషియో - బయోలాజికల్ - క్రయిమ్ థ్రిల్లర్ కథ రాసేడు. సోషియో అంటే సాంఘిక దురాచారాన్ని చీల్చి చెండాడుతూ సంఘంలోని సమస్యల్ని ఎడాపెడా పరిష్కరించి పారేస్తూ సమాజంలోని కుళ్లును జలజలా కడిగెయ్యడం. బయోలాజికల్ - అంటే స్త్రీ పురుష శారీరక సంబంధాలని అరటిపండు వొలిచి నోటిలో పెట్టినంత కూలంకషంగా ఉటంకించడం, క్రయిమ్ థ్రిల్లర్ - అంటే ఒక హత్య; దాని మీద పరిశోధన; చివరికి దుష్ట శిక్షణ (దుష్ట 'శిక్షణ' అంటే దుష్టులకు ట్రైనింగు ఇవ్వడం కాదు, దుష్టులు శిక్షించబడుట అనే అర్థం చేసుకోవాలి.)

ఆ కథ అచ్చవగానే భీమారావు భీమా చేసుకున్న క్వారీ లారీలాగ విజృంభించేడు. స్త్రీ జనోద్ధరణ, దళిత వర్గ సముద్ధరణ, సైన్సు ఫిక్షన్, ఇన్‌ఫర్మేటివ్ ఫిక్షన్, ఇలా ఎన్నో సబ్జక్టులు ఎంచుకొని, ఒక్కొక్క కథలో రెండేసి మూడేసి ఆకర్షణలని పొదిగి, ఏ ఎడిటర్‌కి ఏ కథ ఇష్టం అవుతుందో ఊహించి అతి స్వల్పకాలంలో అర్థనూటపదహారు కథల రచయితగా స్థిరపడ్డాడు. పాఠకుల నాడికన్నా సంపాదకుల నాడి తెలుసుకోవడం అవసరం అని తన అభిమానులకీ జూనియర్లకీ బోధించడం వరకూ వచ్చాడు.

"నువ్వు రేడియోకి ఎందుకు రాయకూడదు!" అన్నాను; అతను నన్నోసారి కాంటీన్‌లో అటకాయించి తన లేటెస్టు కథ ఎలా ఉందని అడిగినప్పుడు; సంభాషణని పక్కదారి పట్టించే ఉద్దేశంతో.

"ఔనండోయి!" అన్నాడు భీమారావు. ఆరోజు నుంచీ నాతో మాట్లాడ్డం మానేశాడు.

"రేడియోలో తన నాటిక ప్రసారం అయ్యేదాకా మీతో మాట్లాడనని శపథం చేసేడండీ" అని బాబూరావు చెప్పేడు. "అవును ఏ నాటికైనా ప్రసారం చేయించి తీరుతాడు" అని నేను అన్నాను.

"పత్రికల్లో కన్నా రేడియోలోనూ, టీవీలోనూ ఆశ్రిత పక్షపాతం ఎక్కువట. అందుకని కొంచెం కష్టం అవుతోందిట. "అని భీమారావు తరపున బాబూరావు సంజాయిషీ కూడా ఇచ్చేడు.

ఒకనాడు వెల్ఫేరు ఆఫీసరుగారి సంతకంతో ఒక సర్క్యులర్ వచ్చింది.: "మన ఆఫీసులో కె.సెక్షన్‌లో పని చేస్తున్న శ్రీ ఎం. భీమారావు రచించిన 'రక్త తర్పణం' అనే నాటిక ఈ నెల 5వ తేదీన రేడియోలో ప్రసారం అవుతుంది. కనుక ఉద్యోగులు, కార్మికులు యావన్మంది ఆరోజు రాత్రి ఎనిమిది గంటలపుడు ఆ నాటిక వినవలసిందహో" - అంటూను.

విన్నాం.

"ఇప్పుడు : రక్త తర్పణం - నాటిక వింటారు. బెంగాలీ మూలం : గురుదేవ్ రవీంద్రనాథ్ టాగోర్ : తెలుగు అనువాదం : శ్రీ ఎం. భీమారావు. ఇందులో పాల్గొన్నవారు :" అంటూ ఎనౌన్సుమెంటు నుంచీ, చివరిదాకా.

మర్నాడు భీమారావు "ఎలా ఉంది?" అని అందర్నీ అడిగే ఉద్యమంలో ఆఫీసులో అన్ని సెక్షన్లూ తిరిగేశాడు. నన్నూ అడిగాడు.

"ఎలాగైనా; టాగోర్ లాంటి రచయిత భారతదేశంలో మరి లేడయ్యా" అన్నాను; పాము చావకుండా, కర్ర విరక్కుండా.

"ఎందుకు లేరు? గురజాడ అప్పారావు, శ్రీపాద శాస్త్రి, మల్లాది శాస్త్రి, దేవులపల్లి శాస్త్రి, శ్రీశ్రీ, కరుణ శ్రీ, ఉష శ్రీ, బాపిరాజు, బుచ్చిబాబు, కామరాజు, సోమరాజు" అంటూ జాబితా చదివేడు.

"ఔననుకో, మనకి జాతీయ పక్షి నెమలి కదా, అలాగే జాతీయ కవి టాగోర్ కనుక నువ్వు మంచి మార్గమే ఎంచుకున్నావు." అన్నాను.

"ఇంతకీ నాటిక ఎలావుందో చెప్పేరు కాదు."

"నిజం చెప్పాలంటే ఆ నాటిక టాగోర్ రాసింది కాదేమో అనిపించింది." అన్నాను భయ పడుతూ.

భీమారావు ఫైర్ అయిపోయాడు. "ఎవడండీ అలా అన్నదీ? రమ్మనండి, పళ్లు రాలగొడతాను! రక్తతర్పణం నాటిక టాగోర్ రాయలేదని అనడానికి ఎన్ని గుండెలు? అసలు టాగోర్ ఎన్ని నాటికలు రాసేరో ఎవరికి సరిగ్గా తెలిసిచచ్చింది కనుక! ఈ సీమలో టాగూర్ని అలా నిర్విరామంగా వింటూనే ఉన్నాం. అయినా ఆయన రాసిన నాటికలు అయిపోలేదు. ఇంకో యాభైయ్యేళ్లు వస్తాయి. టాగూర్ ఎన్ని రాసేరో, వాట్లో ఇది ఉందో లేదో ఈ స్పీడ్ యుగంలో ఎవరండీ రీసెర్చి చేసేది? రమ్మనండి! - అసలు ఈ నాటిక టాగూర్ రాశారా లేదా అని సందేహంతో ప్రసారం ఆలస్యం చేస్తే ఉద్యోగాలు పోతాయి, తెలుసా?"

ఆ మాటలు వినగానే నాకు 'రక్త తర్పణం' నాటిక టాగోర్ రాసేరా లేదా అన్న విషయంలో అన్ని అనుమానాలూ తీరిపోయాయి.

టాగోర్ బతికి ఉంటే; మొదట చెప్పిన 'నాన్ రచయిత్రి' లాగా తను కూడా రేడియోకి ఒక ఉత్తరం రాసే ఉండేవారు కదా- అనుకున్నాను.

★